క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



వేల్పూర్: మండలంలోని కొత్తపల్లి (ఎస్)లో ఇద్దరు లబ్ధిదారులకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరె నితీశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం నర్సారెడ్డి, ఉపసర్పంచ్ లింబాద్రిగౌడ్, కారోబార్ అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయాల పాత్ర కీలకం



ఎడపల్లి(బోధన్): అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణలో ఆయాల పాత్ర కీలకమని బోధన్ సీడీపీవో జానకి అన్నారు. బాపునగర్ గ్రామంలో శనివారం అంగన్‌వాడీ ఆయాల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు పూర్తిగా ఆయాలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని, తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. పిల్లలతో దురుసుగా మాట్లాడొద్దని, ప్రేమ ఆప్యాయతతో మాట్లాడాలని సూచించారు. పిల్లలకు పోషకాహారం అందించాలని, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో విధిగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకొని కూరగాయలు పండించాలన్నారు. సూపర్‌వైజర్ వినోద, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడపాలి



వర్ని: బోధన్ నుంచి గన్నూర్, చందూర్ మీదుగా లక్ష్మాపూర్ వరకు అదనపు బస్సులు నడపాలని బోధన్ డీపో డీఎంకు చందూర్ సర్పంచ్ కర్లం సాయిరెడ్డి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఉదయం, సాయంత్రం మాత్రమే లక్ష్మాపూర్‌కు బస్సులు నడుపుతున్నారని, మధ్యాహ్నం వేళ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజల అవసరాల దృష్ట్యా మరో నాలుగు ట్రిప్పులు అదనంగా లక్ష్మాపూర్‌కు బస్సులను నడపాలని కోరారు.

బోదేపల్లిలో రక్తదాన శిబిరం



బాల్కొండ: మండలంలోని బోదేపల్లిలో టీం-14 యూత్ సభ్యులు శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్మూర్ ప్రాణధార బ్లడ్ బ్యాంకుకు 12 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ రక్తదానం చేసిన యువకులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నోముల రవి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ కరస్పాండెంట్‌గా రామకృష్ణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న లిల్లీపుట్ పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ బెస్ట్ కరస్పాండెంట్‌గా ఎంపికయ్యారు. ఈటీ–టెక్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ రిసోర్సెస్ అండ్ ఎక్స్‌పో ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకున్నారు. కరస్పాండెంట్ రామకృష్ణను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు సన్మానించారు.

పట్టుదలతో సాధించాలి

ఆర్మూర్‌టౌన్: తాము అనుకున్నది పట్టుదలతో సాధించాలని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణుడు చంద్రశేఖర్ సూచించారు. పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో ఉన్న విద్య హైస్కూల్, ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని భార్గవి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుతో కూడిన ఆలోచన నైపుణ్యాలు ఎలా పెంపొందించుకోవాలనే అంశంతోపాటు వ్యక్తిగత వికాసంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవీణ్ పవార్, గోపీకృష్ణ, తులసి పట్వారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వామ్మో.. కోతులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఇళ్ల మధ్యలో తిరుగుతున్న కోతులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంతోపాటు పల్లెల్లో కోతుల బెడద తీవ్రం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వందల సంఖ్యలో కోతులు వీధుల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతులు ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. ఉదయం పూట ఇళ్ల ఆవరణలోకి వచ్చి నానా హంగామా సృష్టిస్తున్నాయి. గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. దీంతో ఇళ్లలో నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పెంకుటిళ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. కూన పెంకులను పీకి పారేస్తున్నాయి. పట్టణంలోని గోలబంగ్లా, పాతబస్టాండ్, హుస్నాబాద్‌కాలనీ, జెండాగల్లీతోపాటు పలు వార్డుల్లో ప్రతిరోజూ కోతుల బెడద తీవ్రంగా ఉంది.

బాటసారులపై దాడులు

పట్టణంలో ప్రతిరోజూ ఏదో ఒకచోట కోతులు దాడి చేస్తున్నాయి. ఉదయం పాఠశాలకు నడిచి వెళ్లాలంటే విద్యార్థులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోతులు వాటికవే గుంపులుగా దాడులు చేసుకుంటూ దుకాణాల్లో చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కూరగాయల మార్కెట్ నుంచి కూరగాయలను ఎత్తుకు వెళ్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

తలుపులు తెరిచి ఉంటే క్షణాల్లో కోతులు ఇంట్లోకి చొరబడుతున్నాయి. ఇంట్లో ఉన్న ఆహారం, సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయి. అధికారులు స్పందించి కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలి.

– సందీప్, ఆర్మూర్

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. నివారణకు చర్యలు తీసుకుంటాం. త్వరలోనే కోతులను బంధించే వారిని తీసుకొచ్చి వాటిని అడవుల్లో వదిలేస్తాం.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ప్రజలు లేని విప్లవాలు గెలువవు



ఎల్లన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భీమ్‌గల్ : ప్రజల కోసం విప్లవోద్య నిర్మాణానికి పూనుకుంటున్న రైతు కూలీ సంఘం, సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకుడు కామ్రేడ్ పిట్ల ఎల్లన్నను మావోయిస్టులు కాల్చి చంపడం విచారకరమని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు బి దేవారాం అన్నారు. పిట్ల ఎల్లన్న 32వ వర్ధంతి సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథ భీమ్‌గల్ మండల కార్యదర్శి రాజేశ్వర్ ఆధ్వర్యంలో పట్టణంలో ఎల్లన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవారాం మాట్లాడుతూ.. ప్రజలే చరిత్ర నిర్మాతలని, ప్రజలు లేని విప్లవాలు ఎన్నడూ గెలువలేవని అన్నారు. ప్రజల్లో ఉండి విప్లవోద్యమ నిర్మాణానికి, రైతాంగ పోరాట నిర్మాణానికి కృషి చేసిన పిట్ల ఎల్లన్నను మావోయిస్టులు పొట్టనపెట్టుకున్నారని, ప్రజాపంథ నాయకులను హత్య చేసి ఏ విప్లవాలను నిర్మిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రజాపంథ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బాబన్న, సత్తెక్క, అరవింద్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం



కిసాన్‌తండాలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



లక్కోరలో నృత్యం చేస్తున్న బాలికలు

బోధన్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్రను రెంజల్ మండలం కిసాన్‌తండాలో శనివారం ప్రారంభించారు. కళ్యాపూర్‌లో సమావేశం నిర్వహించి యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఎంపీపీ లోలపు రజనీకిశోర్, జెడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఆయా శాఖల అధికారులు ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు కొత్త లబ్ధిదారులను నమోదు చేయాలనే లక్ష్యంతో సంకల్పయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పీఎం నరేంద్ర మోదీ సందేశాన్ని ప్రజలకు వినిపించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, మండల అధ్యక్షుడు గోపీకృష్ణ, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అలరించిన బాలికల నృత్యం

వేల్పూర్: వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని లక్కోర ఉన్నత పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. ఎంపీ ధర్మపురి అర్వింద్, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు బాలికల నృత్యాన్ని తిలకించారు. దీనికి ముందు ఎంపీ, జిల్లా అధికారులు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పోస్టర్లను, కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఆడపిల్లలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న శిశుసంక్షేమ అధికారిణి రసూల్ బీ



పాల్గొన్న ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు

బాల్కొండ: ఆడపిల్లల చదువును పోత్సహించాలని జిల్లా శిశు సంక్షేమ అధికారిణి రసూల్‌బీ అన్నారు. మండల కేంద్రంలో శనివారం బాల్కొండ, మెప్కాల్, మెండోరా మండలాల ఆశ వర్కర్లు, మండల సమాఖ్య అధ్యక్షులు, అంగన్‌వాడీ టీచర్లకు బేటీ బచావో, బేటీ పడావోపై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రసూల్ బీ మాట్లాడుతూ.. ఆడ, మగ వివక్ష చూపొద్దని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. లింగ వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆడ పిల్లలకు 18 ఏండ్లు నిండితేనే పెళ్లి చేయాలన్నారు. సీడీపీవో భార్గవి, ఏసీడీపీవో జ్యోతి, సూపర్ వైజర్ శ్రీదేవి, హెచ్‌ఈవో ప్రభాకర్, ఏపీఎంలు గంగాధర్, ప్రసాద్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభాపోటీలు



బోధన్: గణిత శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని రెంజల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మండలస్థాయి క్విజ్, రంగోళి, లలిత సంగీత పోటీలను శనివారం నిర్వహించారు. అనంతరం విజేతులుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం ఆంజనేయులు, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, మండల అధ్యక్షుడు సోమలింగం గౌడ్, ప్రతినిధి రాజేందర్‌సింగ్, విశ్రాంత గణిత ఉపాధ్యాయుడు విజయానంద్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌గౌడ్

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని చేతి వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం ద్వారా నైపుణ్య శిక్షణతోపాటు శిక్షణ కాలంలో రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం పరికరాల కొనుగోలుకు రూ.15వేలు, వృత్తి అభివృద్ధికి రెండు విడతల్లో రూ.3లక్షల వరకు రుణం అందజేస్తారని తెలిపారు. అర్హులు మీసేవ కేంద్రాల్లో ఎలాంటి రుసుము చెల్లించకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో మండల బీజేపీ నాయకులు కె సాయిలు, కన్నె శ్రీనివాస్, గణేశ్, గాండ్ల శివకుమార్, వడ్ల రాజేశ్, కొండల్‌వాడి సాయిలు, శంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర, ఓటు హక్కుపై అవగాహన కలుగుతుందని ప్రిన్సిపల్ కోట ప్రవీణ్ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజేందర్ చౌహాన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌కు ఎంపిక

నవీపేట : మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ హన్మాండ్లు, ప్రిన్సిపల్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈనెల 14న రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలిలో ఎస్‌జీఎఫ్(నిజామబాద్) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 నెట్‌బాల్ టోర్నీలో నిత్యరెడ్డి, లాస్య ఉత్తమ ప్రతిభ కనబరిచారని, మహబూబ్‌నగర్‌లో జనవరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.



రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

'డైలీ' కష్టాలు



పాత జాతీయ రహదారి 44పక్కన మాంసం విక్రయిస్తున్న వ్యాపారులు

బాల్కొండ మండల కేంద్రంలో డైలీ మార్కెట్ నిర్వహణకు స్థలం లేక, మార్కెట్ యార్డు లేక అటు వ్యాపారులకు, ఇటు కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలోని రోడ్డు పక్కన, పాఠశాల ఆవరణలో ప్రస్తుతం డైలీ మార్కెట్ కొనసాగుతున్నది. పాత జాతీయ రహదారి 44 పక్కన మాసం విక్రయిస్తున్నారు. వాహనాల రద్దీ కారణంగా కూరగాయలు, మాంసంపై దుమ్ము చేరుతోంది. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డైలీ మార్కెట్‌యార్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – బాల్కొండ

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న టీజీవీపీ నాయకులు

బోధన్‌రూరల్(బోధన్) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని టీజీవీపీ బోధన్ డివిజన్ అధ్యక్షుడు నాగేశ్ అన్నారు. మండలంలోని కల్దుర్కి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని టీజీవీపీ నాయకులు శనివారం పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా? అని విద్యార్థులను అడిగి తెలుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన వారిలో టీజీవీపీ నాయకులు పీరాజీ, నాగనాథ్, ఉమాకాంత్ తదితరులున్నారు.

డబుల్ బెడ్‌రూం గృహ ప్రవేశం



రుద్రూర్: మండలంలోని రాణంపల్లికి చెందిన రఘు డబుల్ బెడ్ రూం పథకం ద్వారా ఇంటిని నిర్మించుకొని శనివారం గృహ ప్రవేశం చేయగా, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరై లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ అక్కపల్లి సుజాతానాగేందర్, సర్పంచ్ రోజాలక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, రైతుబంధు మండల అధ్యక్షుడు తోట సంగయ్య, నాయకులు అక్కపల్లి నాగేందర్, పత్తి సాయిలు, సుదర్శన్‌గౌడ్, గంగారాం తదితరులున్నారు.

23న వైకుంఠ ఏకాదశి వేడుకలు



బోధన్‌రూరల్(బోధన్) : మార్గశిర మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో ఉన్న లక్ష్మీగోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23న వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ మేరకు ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులతో కలిసి వైకుంఠ ఏకాదశికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అంతకు ముందు లక్ష్మీగోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ



కోటగిరిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాలధారులు



తల్వేదలో అభిషేకం చేస్తున్న మాలధారులు

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని తల్వేదలో సాయిరెడ్డి గురుస్వామి 18వ నారికేల మహాపడిపూజను ఆచార్య తేజ చక్రవర్తుల ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడు, సుబ్రహ్మణ్యం, అయ్యప్పస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

19న కోటగిరిలో..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 19న మండల మహాపడి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు పోల విఠల్‌రావు ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

డిచ్‌పల్లి: జిల్లాలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 67వ అండర్– 17 జిల్లా స్థాయి నెట్‌బాల్ బాల, బాలికల పోటీల్లో సుద్దులం జెడ్పీహెచ్ఎస్ బాలికలు ప్రథమ స్థానం, బాలురు ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్‌ఎం బి.గంగారాం క్రీడాకారులను అభినందించారు. సర్పంచ్ వెంకటేశ్, ఉప సర్పంచ్ రాంరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ భూమేశ్వర్, వీడీసీ సభ్యులు మహిపాల్, సాయిప్రసాద్, సాయన్న, గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు



బిల్లులు చెల్లిస్తున్న రైతులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ విద్యుత్ బిల్లులు చెల్లించారు. శనివారం ఒకే రోజు గ్రామానికి చెందిన 668 వ్యవసాయ మోటార్లకు సంబంధించిన రూ.2,46,898 బిల్లులను చెల్లించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌నాయక్, లైన్‌మెన్ కృష్ణకుమార్, దినేశ్, షాహీద్, దినేశ్, రైతులు ఎంసీ గంగారెడ్డి, ఆలూర్ నారాయణరెడ్డి, నల్లవెల్లి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బార్' కార్యాలయం ప్రారంభం

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లాకోర్టు ప్రాంగణంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్యాలయాన్ని ఆధునీకరించుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. అదనపు జిల్లా జడ్జి ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీకాంత్‌బాబు, పద్మావతి, బార్ అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి భాగీచరణ్, సంయుక్త కార్యదర్శి సురేశ్, కోశాధికారి బిట్ల రవి, లైబ్రరీ కార్యదర్శి బాలరాజు నాయక్, ప్రభుత్వ న్యాయవాదులు పాల్గొన్నారు.

తెయూ లైబ్రరీకి అంబేడ్కర్ పుస్తకాలు అందజేత



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీకి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్ర గ్రంథాలను హిందీ విభాగం పీహెచ్‌డీ స్కాలర్ ప్రకాష్ అందజేశారు. ఈసందర్భంగా తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి మాట్లాడుతూ.. వర్సిటీ సెంటర్ లైబ్రరీకి అత్యంత విలువైన అంబేడ్కర్ చరిత్ర గ్రంథాలు అందించడం అభినందనీయమన్నారు. హిందీ విభాగం అధ్యక్షుడు ఎండీ జమీల్, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ అరుణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్ సాయిలు, స్కాలర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – చే లాంగ్‌లీవ్(తెలుగు)-12.50
జోరుగా హుషారుగా (తెలుగు)- 3.40, 6.40
కలశ(తెలుగు)- 9.50

స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 12.00, 03.15, 6.30, 09.45

స్క్రీన్-3 – తికమక తండా (తెలుగు)- 12.15,
హాయ్ నాన్న - 2.45
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మెన్ -06.00
పిండం (తెలుగు) - 09.20

స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00, 6.00, 9.00